ప్రజల తరపున బీఆర్ఎస్ ప్రశ్నిస్తూనే ఉంటుంది

కేటీఆర్‌కు మద్దతుగా తెలంగాణ భవన్ వద్ద
షాబాద్ మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డితో బీఆర్ఎస్ శ్రేణులు

- షాబాద్ మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి
- కేటీఆర్‌కు మద్దతుగా తెలంగాణ భవన్‌కు తరలివెళ్లిన బీఆర్ఎస్ శ్రేణులు

షాబాద్, జూన్ 16 : కాంగ్రెస్ ప్రభుత్వం కేసులు, కమీషన్ల పేరుతో ఎన్ని కుట్రలు చేసినా ప్రజల తరపున బీఆర్ఎస్ ప్రశ్నిస్తూనే ఉంటుందని షాబాద్ మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఈ-ఫార్ములా కేసులో ఏసీబీ కోర్టుకు హాజరైన బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మద్దతుగా షాబాద్ మండలం నుంచి పట్నం అవినాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని చెప్పారు. ఆరు గ్యారెంటీల పేరుతో తెలంగాణ ప్రజలను మోసం చేసిందన్నారు. కేసులు, కమీషన్ల పేరుతో బీఆర్ఎస్‌ను ఇబ్బంది పెట్టాలని చూస్తున్న ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు నర్సింగ్‌రావు, పార్టీ శ్రేణులున్నారు.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసిన షాబాద్ మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి

సమస్యలు వెంటనే పరిష్కరించాలి

రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి ప్రజావాణికి 68 ఫిర్యాదులు

కలెక్టర్ కార్యాలయంలో వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి, జూన్ 16 (నమస్తే తెలంగాణ)/ ఆదిబట్ల : ప్రజావాణికి ఫిర్యాదుల రూపంలో వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి 68 ఫిర్యాదులు అందగా.. కలెక్టర్, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను పెండింగ్‌లో పెట్టకుండా సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 30, ఇతర శాఖలకు–38, మొత్తం 68 దరఖాస్తులు అందాయని జిల్లా అధికారులు తెలిపారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారులకు కలెక్టర్ సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడా ప్రజలు వ్యాధులకు గురికాకుండా అప్రమత్తం చేయాలని, అవగాహన కల్పించాలని జిల్లా యంత్రాంగానికి సూచించారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, అధికారులు, తహసీల్దార్లు, కలెక్టర్‌రేట్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

కడారి శివరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, బీఆర్ఎస్ నాయకులు

సమాజాభివృద్ధికి శివరాజు సేవలు మరువలేనివి

కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

కడ్తాల్, జూన్ 16 : సమాజాభివృద్ధికి విశ్రాంత ఉద్యోగి, కురుమ సంఘం రాష్ట్ర నాయకుడు కడారి శివరాజు చేసిన సేవలు చిరస్మరణీయమని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన కడారి శివరాజు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై మరణించారు. సోమవారం మధ్యాహ్నం జైపాల్‌యాదవ్ మృతుడి కుమారులు బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ, రమేశ్, హర్షవర్ధన్‌తోపాటు కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం శివరాజు చిత్రపటానికి నివాళులర్పించారు. పరామర్శించినవారిలో మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ వెంకటేశ్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పరమేశ్, ఆమనగల్లు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, కల్వకుర్తి మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యం, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులున్నారు.

విధుల బహిష్కరణ

వికారాబాద్, జూన్ 16 : న్యాయవాదుల రక్షణ చట్టాన్ని సత్వరమే తీసుకురావాలని వికారాబాద్ జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూలి బస్వరాజు తెలిపారు. సోమవారం న్యాయవాదులపై జరిగిన దాడిని నిరసిస్తూ వికారాబాద్ జిల్లా కోర్టు న్యాయవాదుల సంఘం విధులను బహిష్కరించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 14న హైదరాబాద్‌లోని సిటీ సివిల్ కోర్టుకు సంబంధించిన న్యాయవాదులు పి.నారాయణ, శైలేష్‌సక్సేనాలపై దాడి జరిగింది. సామాన్యుడికి న్యాయం కోసం కొట్లాడే కార్యక్రమంలో వాళ్ల విధుల నిర్వహణకు అడ్డుపడి వాళ్లపై చేస్తున్న దాడులకు నిరసనగా ఈ బందుకు పిలుపు ఇవ్వడం జరిగిందన్నారు. తక్షణమే న్యాయవాదుల రక్షణ చట్టం తెచ్చి వాళ్లకు న్యాయం చేయాల్సిందిగా ప్రభుత్వానికి ఆయన విన్నవించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శంకరయ్య, జాయింట్ సెక్రెటరీ ఆనంద్, సీనియర్ న్యాయవాదులు, జిల్లా లీగల్ సెల్ చైర్మన్ వెంకటేశ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఇండ్లు కేటాయించినా ఇవ్వరా?

డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల ఎదుట లబ్ధిదారులతో కలిసి నాయకుల ధర్నా

ధర్నా అనంతరం అధికారులతో మాట్లాడుతున్న సీపీఎం, బీఆర్ఎస్ నాయకులు

మంచాల, జూన్ 16 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అర్హులైన లబ్ధిదారులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయించినప్పటికీ.. ఇప్పుడున్న అధికారులు మాత్రం లబ్ధిదారులకు ఇండ్లు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమంటూ సోమవారం మంచాల మండలం లింగంపల్లి, నోముల, మంచాల డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల లబ్ధిదారులతో కలిసి సీపీఎం, బీఆర్ఎస్ నాయకులు లింగంపల్లి గేటు వద్ద ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల ఎదుట ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య మాట్లాడుతూ.. లింగంపల్లి గేటు వద్ద 96 మందికి గత ప్రభుత్వం డబల్ బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయించినప్పటికీ.. నేటికీ ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. ఇండ్లులేక ఎంతోమంది నిరుపేదలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా అధికారులు మాత్రం ఏమీ పట్టనట్లుగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. లింగంపల్లి గేటు వద్ద కేటాయించిన ఇండ్లను ఇవ్వకపోతే.. సీపీఎం, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో లబ్ధిదారులను ఆ ఇండ్లలోకి పంపిస్తామని స్పష్టం చేశారు. దీంతో స్పందించిన మంచాల తహసీల్దార్ కేవీవీ ప్రసాద్‌రావు ఈ నెల 23న అధికారికంగా లబ్ధిదారులందరితో గృహప్రవేశం చేయించనున్నట్లు చెప్పారు. దీంతో నాయకులు ధర్నా విరమించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జంగయ్య, బీఆర్ఎస్ నాయకులు మహేందర్‌యాదవ్, పరమేశ్, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముస్లింలకు ప్రాధాన్యమివ్వాలి

బొంరాస్‌పేట, జూన్ 16 : రాష్ట్రంలో ముస్లింలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఒక మంత్రి పదవి కూడా ఇవ్వలేదని.. తగిన ప్రాతినిధ్యమివ్వాలని ముస్లిం హక్కుల పోరాట సమితి నాయకులు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అన్నారు. పక్క రాష్ట్రమైన కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింలను గౌరవిస్తూ ముగ్గురు నేతలను మంత్రివర్గంలోకి తీసుకుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారానికి తీసుకురావడంలో ముస్లిం వర్గాలు ప్రముఖ పాత్ర పోషించాయని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక మత, సామాజిక సంస్థలు, విద్యార్థి సంఘాలు బహిరంగంగా కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నాయన్నారు. అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలు చేపట్టేందుకు తెలంగాణ రాష్ట్ర ముస్లిం హక్కుల పోరాట సమితి సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ వసీం పాల్గొన్నారు.

ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న హౌస్ సర్జన్స్, పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థులు

స్టైఫండ్ ఇవ్వాలి

వికారాబాద్, జూన్ 16 : నాలుగు నెలల స్టైఫండ్ ఇవ్వాలని హౌస్ సర్జన్స్, పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థులు సోమవారం వికారాబాద్ మహావీర్ కళాశాలలో విధులు బహిష్కరించి నిరసనకు దిగారు. యాజమాన్యం చెల్లించవలసిన స్టైఫండ్ (జీతాలు) నాలుగు నెలల నుంచి ఇవ్వడంలేదని తెలిపారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు రూ.58,389 చెల్లించాల్సి ఉందని, ఇది ఇవ్వకపోగా నిరసన తెలియజేస్తున్న తమపై యాజమాన్యం జులుం ప్రదర్శిస్తున్నదన్నారు. పీజీ సీటు ముఖ్యమా, స్టైఫండ్ ముఖ్యమా, పరీక్ష రాయాలని లేదా అంటూ చివాట్లు పెట్టారన్నారు. విధుల్లోకి చేరకపోతే తీవ్ర చర్యలు ఉంటాయని బెదిరిస్తున్నారన్నారు. సర్టిఫికెట్లు కూడా ఇవ్వబోమని కూడా బ్లాక్‌మెయిల్ పాల్పడుతున్నదన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ కల్పించుకొని న్యాయం చేయాలని కోరారు.

అటకెక్కిన మెట్రో ఫేజ్-2

- కేంద్రానికి చేరిన డీపీఆర్
- ఆరు నెలలు గడిచినా.. లభించని మోక్షం
- టెక్నికల్ సమస్యలపై చర్చలతో కాలయాపన
- విస్తరణ ప్రతిపాదనలపై సర్కార్ కంటితుడుపు చర్యలు

సిటీబ్యూరో, జూన్ 16 (నమస్తే తెలంగాణ): మెట్రో ఫేజ్-2 విస్తరణ అటకెక్కింది. కేంద్రానికి చేరిన డీపీఆర్‌కు ఆరు నెలలు గడిచినా.. మోక్షం లభించడంలేదు. నిజానికి ఈ ప్రక్రియ ఎప్పుడో పూర్తి కావాల్సింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా విస్తరణ ప్రతిపాదనలపై కంటితుడుపు చర్యలతో నెట్టుకొస్తున్నది. దీంతో డీపీఆర్ ప్రతులు ఢిల్లీకి చేర్చిన మెట్రో బృందం.. ఇక అడపాదడపా ఢిల్లీ, హైదరాబాద్ మధ్య రాకపోకలు సాగిస్తున్నదే తప్పా.. స్పష్టమైన హామీ ఇప్పటికీ అందలేదు. ఈ క్రమంలో సీఎం రేవంత్ కూడా ఈ విషయంలో కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చే ఆలోచన చేయకపోవడంతో... అట్టహాసంగా ప్రకటించిన ప్రాజెక్టులో జరుగుతున్న జాప్యంతో ఆశలు నీరుగారిపోతున్నాయి.

కేంద్రం ఆమోదం కోసం..

మెట్రో ఫేజ్-2ను విస్తరించేందుకు హైదరాబాద్ మెట్రో సంస్థ సన్నాహాలు చేసింది. ఇప్పటికే డీపీఆర్ ప్రతులను కేంద్రానికి అందజేసింది. ప్రాజెక్టు అంచనా వ్యయంలో 48 శాతం మేర జైకా, ఏడీబీ, ఎన్‌డీబీ(మల్టీ లెటరల్) వంటి ఆర్థిక సంస్థలతో ప్రాజెక్టు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.7313 కోట్లు (30 శాతం), కేంద్ర వాటా రూ.4230 కోట్లు (18 శాతం) మేర చేపట్టనున్నది. ఇతర ఆర్థిక సంస్థల నుంచి తీసుకునే అప్పులకు కేంద్రం గ్యారెంటీ ఇవ్వనున్నది. మిగిలిన 4 శాతం మేర రూ.1033 కోట్లను పీపీపీ విధానంలో సమకూర్చి ప్రాజెక్టును చేపట్టేలా డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టును హైదరాబాద్ మెట్రో సంస్థ తయారు చేసింది. రెండో దశలో ఆరు కారిడార్లలో 116.4 కిలోమీటర్ల మేర మెట్రోను విస్తరించనున్నట్లు తెలిపారు. ఐదు కారిడార్లలో 76.4 కి.మీ., ఆరో కారిడార్‌ను శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఫోర్త్ సిటీకి 40 కి.మీ., నార్త్ సిటీకి మరో 44 కి.మీ. మేర విస్తరించేందుకు ప్రతిపాదనలను తయారు చేయాల్సి ఉంది. మిగిలిన 5 కారిడార్ల నిర్మాణానికి అవసరమైన నివేదికలను రూపొందించగా, కేంద్రం ఆమోదం కోసం ఎదురుచూస్తున్నది.

ఆరు నెలలు గడిచినా..

తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేంద్రం నుంచి భారీ ఆర్థిక సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. మెట్రో నిర్మాణానికి అంచనా వేసిన రూ.4230 కోట్లు బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు పొందేందుకు రాష్ట్ర ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకోలేదు. డీపీఆర్‌కైనా ఆమోదం లభిస్తుందని భావించినా.. ఇప్పటివరకు ఆ అంశాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. డీపీఆర్ ఆమోదానికి మరో మూడు నెలల సమయం పట్టే అవకాశం ఉందని తెలిసింది. ఇప్పటికే నార్త్ సిటీ, ఫోర్త్ సిటీ ప్రాజెక్టులకు సంబంధించిన డీపీఆర్ నివేదికలను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించగా, త్వరలోనే కేంద్రానికి అందజేయనున్నారు. మూడు నెలలోగా డీపీఆర్‌కు ఆమోదం తెలిపితే... కనీసం సెప్టెంబర్ నాటికైనా పనులు ప్రారంభించే అవకాశం ఉంటుంది.

పథకాలు అందేలా దృష్టి సారించాలి

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ ప్రజావాణికి 84 దరఖాస్తులు

ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, జూన్ 16 : ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులకు సూచించారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి జిల్లా ఆదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆర్డీవో వాసుచంద్రలతో కలిసి విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో అపరిష్కృతంగా ఉన్న సమస్యల సత్వర పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు, బడిబాట, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పరిశీలించాలని సూచించారు. చౌకధర దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని, అదేవిధంగా మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రజావాణిలో 84 దరఖాస్తులు రాగా.. రెవెన్యూ సమస్యలతోపాటు వ్యవసాయ, భూముల సర్వే, పెన్షన్లు, ఆర్టీసీ, ఇండ్ల, రేషన్ కార్డులు మంజూరు తదితర అంశాలపై ఉన్నాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను గౌరవించాలి

ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను గౌరవించాలని కలెక్టర్ అన్నారు. వికారాబాద్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బడిబాట, ఎఫ్ ఎల్ఎన్, ఎల్ఐపీ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమాజంలో ఉజ్వల భవిష్యత్తు ఏర్పడాలంటే విద్యార్థులందరూ బాగా చదువుకొని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపీ కార్యక్రమాలు సక్రమంగా అమలు జరిగేలా చూడాలని, విద్యార్థుల్లో తగిన సామర్థ్యాలు పెంపొందించడానికి ఈ కార్యక్రమాలు ఎంతో సహకరిస్తాయని వివరించారు. విద్యార్థులు ఉన్నతాశయాలతో బాగా చదవాలని సూచించారు. విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనను తిలకించిన కలెక్టర్ స్పందించి తమ చిన్ననాటి ఉపాధ్యాయురాలు తారాబాయిని గుర్తు చేసుకున్నారు. ఆమె చదువు చెప్పడం వల్లే తాను ఈ స్థాయిలో ఉన్నానని చెప్పారు. ఈ సంవత్సరం 10వ తరగతి విద్యార్థులు 100 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యూనిఫామ్స్, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటుచేసిన టీఎల్ఎం స్టాల్స్‌ను సందర్శించి ఆ సామగ్రిని తయారు చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థులను ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రేణుకాదేవి, మండల విద్యాధికారి బాబూసింగ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీశైలం, ఎస్ఎంసీ చైర్మన్ విజయలక్ష్మి, cmo రజనీకుమారి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

మా భూమిపై మాకు పట్టా చేయండి

సర్వే నంబర్లు 719, 720, 725, 726, 727, 43లలో 16 ఎకరాల భూమి ఉన్నది. చాలా సంవత్సరాలుగా కాస్తుల్లో ఉన్నాం. వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. గత మూడు తరాల నుంచి వ్యవసాయ పనులు చేసుకుంటున్నాం. మా భూములు ఇతరుల పేరుపై పడ్డాయి. మా భూమిని మా పేరుపైకి మార్చాలని కోరుతున్నాం. అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలి.

- మహమ్మద్ సలీం, మోత్కూర్, దోమ

మా భూమి ఆన్‌లైన్‌లో ఎక్కలేదు

మాకు 37 గుంటల భూమి ఉంది. వ్యవసాయం చేసుకుంటూ జీవనం గడుపుతున్నాం. చాలా రోజులుగా మా భూమి ఆన్‌లైన్‌లో ఎక్కలేదు. ప్రభుత్వం అందించే రైతుబంధు డబ్బులు కూడా రావడంలేదు . ఎన్నో రోజులుగా ఈ సమస్యతో ఇబ్బందిపడుతున్నా. ఆన్‌లైన్‌లో ఎక్కించాలని అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి మా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాం.

- బెడికానాయక్, కుసుమ సముద్రం, కులకచర్ల

ప్రజావాణికి హాజరైన అధికారులు

ప్రభుత్వ పాఠశాలలే ముద్దు

ప్రైవేట్ పాఠశాలల వాహనాలను అడ్డుకుంటున్న ఎల్లమ్మతండా గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు

మంచాల, జూన్ 16 : ప్రైవేట్ పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలలో మిన్న అంటూ సోమవారం మంచాల మండలం ఎల్లమ్మతండా గ్రామంలో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ప్రైవేట్ పాఠశాలలకు తమ పిల్లలను పంపించబోమంటూ గ్రామంలోకి వచ్చిన ప్రైవేట్ పాఠశాల వాహనాలను వారు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ట్రైబల్ వెల్ఫేర్ టీచర్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మానాయక్ మాట్లాడుతూ.. ఎల్లమ్మతండాలో మూతపడిన ప్రభుత్వ పాఠశాలను మళ్లీ ప్రారంభించడానికి ముందుకు వచ్చిన గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులను ఆమె అభినందించారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ఇప్పటికే వంద మంది అడ్మిషన్లు తీసుకోవడం సంతోషించదగ్గ విషయమన్నారు. తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలకు పంపించకుండా ప్రభుత్వ పాఠశాలకు పంపించి సర్కారు విద్యార్థులకు అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్‌తో పాటు తదితర వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిషన్‌నాయక్ ఉన్నారు.

జిల్లాలో ఐదు సంచార వైద్యశాలలు

రంగారెడ్డి, జూన్ 16 (నమస్తే తెలంగాణ) : రంగారెడ్డిజిల్లాలో పశువులకు మెరుగైన వైద్యసదుపాయాలు అందించేందుకు ఐదు సంచార వైద్యశాలలను ఏర్పాటు చేసినట్లు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ బాబు తెలిపారు. జిల్లాలోని షాద్‌నగర్, చేవెళ్ల, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాల్లో గ్రామాల్లో రైతులందరికీ అందుబాటులో పశువైద్యశాలలుంటాయన్నారు. టోల్ ఫ్రీ నం.1962కు ఫోన్ చేసిన వెంటనే సంబంధిత సంచార పశువైద్యశాలలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.జిల్లాలోని మూగజీవాలన్నింటికీ క్యాలెండర్ షెడ్యూల్ ప్రకారం వ్యాధి నిరోధక టీకాలు ఇస్తున్నామని, ఇది నిరంతర ప్రక్రియ అని, ఈ టీకాలతో అంటువ్యాధులు రాకుండా ఉండటంతోపాటు పశువుల మరణాలు కూడా తగ్గుతాయన్నారు. అత్యవసర మందులతోపాటు నట్టల నివారణ, యాంటీ బయోటిక్స్ వంటి మందులను ఇప్పటికే వైద్యశాలలకు సరఫరా చేశామని, వచ్చే వర్షాకాలంలో పశువులకు ఎలాంటి వ్యాధులు రాకుండా ఈ మందులు ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ వెటర్నరీ అసిస్టెంట్లకు పదోన్నతులిచ్చామని, దీంతో జిల్లాలోని పశువైద్యశాలల్లో సిబ్బంది కొరత కూడా తీరుతుందన్నారు. కలెక్టర్ ఆదేశానుసారం పశువులకు సరైన వైద్యసేవలందించేందుకు ఎప్పటికప్పుడు తాము పర్యవేక్షిస్తున్నామని, మూగజీవాలకు మరింత మెరుగైన వైద్యసేవలందించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

నైపుణ్యంతో కూడిన శిక్షణ అవసరం

నందిగామ, జూన్ 16 : దేశంలోని యువత నైపుణ్యంతో కూడిన శిక్షణ పొందాల్సిన అవసరం ఉందని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హా శాంతివనంలో ఏర్పాటు చేసిన కౌశల్ మంథన్ ప్రాంతీయ వర్క్ షాపును సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా దక్షిణాది రాష్ట్రాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి నైపుణ్యం కలిగిన శిక్షణ గురించి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వం వికసిత 2047 లక్ష్యంగా పని చేస్తుందని తెలిపారు. దేశంలో అత్యధిక శాతం యువత ఉందని, యువతకు మంచి నైపుణ్యం కలిగిన శిక్షణ అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని, అందులో భాగంగానే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు, ఇన్‌స్టిట్యూట్ లను ఏర్పాటు చేస్తున్నదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరస్పర సహకారంతో ఇలాంటి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేశంలోని వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, జూన్ 16 : శ్రీ సవిత్ర ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్‌లో ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనా అధికారి షేక్ అబ్దుస్ సుభాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వికారాబాద్ ఐటీఐ క్యాంపస్ జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో జూన్ 18న ఉదయం 10:30 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 5 మార్కెటింగ్ మేనేజర్, 20 ఎగ్జిక్యూటివ్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటికి కనీస వయస్సు 18 నుంచి 30 సంవత్సరాలలోపు నిరుద్యోగ యువత అర్హులని తెలిపారు. ఇంటర్/డిగ్రీ/పీజీ విద్యార్హత కలిగి ఉండాలన్నారు. ఈ ఉద్యోగాలు కూకట్‌పల్లి, హైదరాబాద్‌లో ఉన్నాయని.. జాబ్ మేళ ద్వారా ఎంపికైన వారి నేరుగా ఉద్యోగం కల్పించబడునని వివరించారు. ఇతర వివరాలకు జాబ్ మేళా నిర్వాహకుడు మియాసాబ్ 9676047444ను సంప్రదించవచ్చని ఆయన సూచించారు.

హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం

యాచారం, జూన్ 16 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఆసరా పింఛన్‌దారులకు ఇచ్చిన హామీ నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య విమర్శించారు. సోమవారం అయన విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మే